# తప్పెవరిది?

**-కె. ఆర్. కె. మోహన్**

కోర్టులో ఆ రోజు విచారణలో వున్న కేసు ఎటెంప్టెడ్ రేప్ గురించి. రాజుని తీసుకువచ్చి బోనులో నిలబెట్టారు. ప్రమాణం చేయించడం పూర్తయింది.

''యస్! యూకెన్ ప్రొసీడ్'' అన్నారు జడ్జీగారు లత తరఫు వకీలుతో.

''ఏం జరిగిందో వివరంగా చెప్పమ్మా'' అన్నాడాయన లతతో.

''ఆ రోజు సాయంత్రం నేను కాలేజీ నుంచి తిరిగి వస్తున్నాను. బస్ దొరక్కపోయేసరికి నడిచి వస్తున్నాను. అప్పుడు రోడ్డుమీద జన సంచారం కూడా లేదు. కొంచెంసేపయ్యాక ఎవ్వరో వెంబడిస్తున్నట్లనిపించింది. తిరిగి చూస్తే అదిగో ఆ బోనులోవున్నవాడు నన్ను వెంటాడుతున్నాడు. నేను భయంతో వడివడిగా అడుగులు వేయసాగాను. అతను వడివడిగా నన్ను సమీపించి ఏమిటేమిటో పిచ్చిపిచ్చిగా వాగసాగాడు. నేను భయంతో ఏమీ మాట్లాడలేక పోయాను. నా చేయి పుచ్చుకుని ప్రక్కపొదల చాటుకు లాక్కెళ్లి నన్ను బలవంతం చేయబోయాడు. ఇంతలో ఏదో జీపు వస్తున్న శబ్దం వినిపిస్తే నేను గట్టిగా అరిచాను. అప్పుడు అందులోని వారు వచ్చి నన్ను రక్షించి వీడిని పోలీసులకు అప్పచెప్పారు'' అంటూ వివరించింది లత.

''ఆ అమ్మాయి చెప్పినదానికి నీ సమాధానం ఏమిటి?'' అన్నారు జడ్జీగారు.

''మిలార్డ్! ఆమె చెప్పినదంతా నిజం. ఆమెను నేను బలవంతం చేయబోయింది నిజమే. కానీ అందుకు నేను బాధ్యుడిని కాదు. ఆమే బాధ్యురాలు.'' అన్నాడు రాజు.

''నీ ఉద్దేశ్యం! ఆ అమ్మాయే నిన్ను ప్రేరేపించిందా?'' అని గద్దించాడు లత తరఫు న్యాయవాది.





''సూటిగా ప్రేరేపించలేదు. ఇప్పటిలాగే అప్పుడూ ఆ అమ్మాయి డ్రెస్ చేసుకుంది. అర్ధనగ్నంగా వున్న ఆమె శరీరం, ఆ బిగుతు దుస్తులు... అంతవరకూ నాలో కలగని కామ వికారాన్ని కల్పించాయి. ఆమెను అనుభవించాలనే స్థితికి దిగజారాను. నేను తట్టుకోలేకపోయాను. నా ఆవేశాన్ని దాచుకోలేక పోయాను. నా నేరాన్ని ఒప్పుకుంటున్నాను'' అన్నాడు రాజు.

కోర్టులో నిశ్శబ్దం తాండవించింది. జడ్జీగారు లతవంక పరకాయించి చూసి తమ తీర్పు చెప్పారు.

''పవిత్రమైన ఈ న్యాయస్థానానికి కూడా ఈ అమ్మాయి అసభ్యకరమైన దుస్తులతో అర్ధనగ్నంగా వచ్చింది. తన స్త్రీత్వాన్ని ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తుంటే వయసు మళ్లిన వారికి కూడా చిత్తచాంచల్యం కలుగుతుంది. అటువంటిది మంచి వయసులో వున్న రాజుకి మనోవికారం కలగడంలో ఆశ్చర్యంలేదు. పరిస్థితుల ప్రాబల్యానికి లొంగి అతను ఈ పనికి పూనుకున్నాడు. ఇందులో ఈమె బాధ్యతే ఎక్కువుంది. అసలు యువకులను ఆకర్షించడానికి కాకపోతే ఈ విధంగా తయారవడంలో ఉద్దేశ్యం ఏమిటి? అందువల్ల ఇకముందు మనో నిగ్రహం పాటించడానికి ప్రయత్నించవలసిందిగా రాజుకి సలహా ఇస్తూ ఈ కేసును కొట్టివేస్తున్నాను. అలాగే ఈ అమ్మాయి కూడా ఇలా అసభ్యకరమైన దుస్తులు ధరించడం మంచిదికాదని సలహా ఇస్తున్నాను.''

జడ్జీగారి తీర్పుతో తల దించుకుంది లత.

★